# నాగదేవత : నాంచారవ్వ

అనేక సంవత్సరములుగా సాక్షిసంఘము మూత పడినది. కాని ఇటీవల మరల మూడు సమావేశములు జరిగినవి. అనేకులు నూతన సభ్యులును వచ్చి రెట్టించిన ఉత్సాహముతో చేరుచున్నారు. ఈ రోజు నేను సమావేశమునకు వెళ్లుసరికి కొంతకాలాతీతమైనది. నన్ను చూడగానే మిత్రులు కొందరు, "ఓహో జంఘాల శాస్త్రిగారూ మీ కొరకే చూచుచున్నాము. త్వరత్వరగా రండు. చర్చ మాంచి రసపట్టున సాగుచున్నది. మీరుండుట చాల యవసరము - " అనుచు ఆహ్వానించిరి.

"ఆలస్యమైనది. మన్నించుడు. జన్నవరం అను గ్రామమునకు వెళ్ళి ఒకవింత పొడమగా దాని అంతుతేల్చుకొని వచ్చుసరికింత వేళయైనది. చర్చకొనసాగనిండు. మాటలాడవలసినవారు పూర్తిగా మాటలాడిన తరువాతనే నేనుపన్యసింతును " అని నేను కొర్చుంటిని.

నూతన సభ్యుడైన సత్యవ్రతుడను నాయన ఈ విధముగా ఉపన్యసింపదొడగెను.

## నాగదేవత

"అయ్యా! జరిగిన ఒక కథను తెలిపెదను ఉత్తర హిందూస్థానములో 'కో ట' అను గ్రామమున మా అక్క కలదు. ఆమె భర్త ఆయూరిలో ప్రభుత్వోద్యోగము చేయుచున్నాడు. నా యౌవనములో నేను కొంతకాలమా గ్రామమున గడుపుట తటస్థించినది. మా అక్క వివాహానంతరము కూడా నేనా గ్రామమునకనేకమార్లు వెళ్ళియుంటిని, ఆ యూరిలో నాకనేక మంది మిత్రులుకలరు.

మొన్న వెళ్లినప్పటికి కొందరు మిత్రులు కలిసి, "ఎంటివావింత-ఇక్కడ నొక అమ్మాయిపై నాగదేవత వాలినదట" అని చెప్పిరి. ఒక పురాతనమైన కోట సమీపమునకట్టుటచే ఆ వూరికి ఆ పేర వచ్చినది ఆయూరిలో కోటవీథి కూడ కలదు అది ఆ ఊరికి చాల చివరకలదు. సరియె చూతమని ఒకరోజు ఆ ప్రాంతమునకు బోయితిని. అక్కడ కొన్ని తెలుగు కుటుంబములు కూడ కలవు. ఒక పదిహేనేళ్ళ యువతిపై నాగదేవత దిగినదట. నేను బోవుసరికి చాల సందడిగానున్నది. ఆ యువతి నేలపై పామువలె నటించుచు దొర్లుచున్నది. మధ్య మధ్య బుస్‌బుస్ మని అరచుచున్నది. దొర్లుచు కాళ్ళపై బట్ట నిండుగా సవరించుకొనుచున్నది. కొన్నాళ్ళ క్రితము ఆమెనాగిని సినిమా చూచినదని, నాగమోహిని, యను నవల చదివినదని అప్పటినుండి అట్లు మారినదని చెప్పిరి. పాముకూడకరచినదని కొందరు చెప్పిరి. చివరగా మనసికోన్మాదముగా నాకు కనిపించినది.

"ఇదేమియు దేవతకాదు, మానసిక భ్రమ. సమరసింహుడను నా మిత్రునికి కట్లపాముకరచినది. ఆయన మనోధైర్యముతో వెంటనే వైద్యము చేయించుకొనెను. బ్రతికినాడు. కనుక ఒకవేళ ఈమెకు పాము కరచినను భయపడవలసినది లేదు, పాము కాటుకు మనుష్యులు చనిపోవుదురనుట పొరపాటు. "అనినేను అక్కడి పెద్దలకు చెప్పితిని. వారు వినలేదు. నాగదేవతయే యని సంపూర్ణ విశ్వాసముతో నుండిరి. ఇంతలో ఎవరో వెళ్ళి నేనిట్లనుచున్నానని ఆ అమ్మాయి చెవిలోనూదిరి ఆమె రెచ్చిపోయినది.

అల్లం త దూరమున నిలిచిన నన్ను దగ్గరికి వచ్చి క్షమాపణ వేడుమని, లేకున్న ప్రమాదమని అందరు చెప్పిరి. నేను రానని, నమస్కరించనని తిరస్కరించితిని. చివరికి మేము దొర్లుచు నావరకును వచ్చినది. ఈ లోగ మరిందరు జనులు కూడి దేవతను తిరస్కరించుట దోషమని నన్ను తీవ్రముగా నిందింప దొడగిరి. వారి దూకుడు దుడుకుదనము చూడగా అందరునూ ఏకమై నన్ను నాలుగు మోది ఆ యమ్మాయి కాళ్ళపై పడవేయునట్లుగా కనపడినది. అది నా ఊరుకాదు. వాడకాదు. తోడెవ్వరును లేరు. నా విశ్వాసము లటుంచి నమస్కరించుటయే ప్రస్తుతమునకు తగు కర్తవ్యమని యోచించితిని. నన్ను తనకు నమస్కరించమనీ, లెంపలు వాయించుకొమ్మనీ - ఆ నాగయువతి నన్ను ఆజ్ఞాపించినది. వాయించుకొనుడు, వాయించుకొనుడని - చుట్టుగలవారందరు ఏక కంఠముతో గోలచేసిరి. ఇక తప్పదని గ్రహించి, నమస్కరించి. లెంపలు వేసుకొంటిని. శృంగభంగమై ఇల్లుచేరితిని.

కాని ఈ మూర్ఖాచారమును, దుడుకుతనమును ఛేదించి నిజమెటులైనను బయలు పరచవలెనని దృఢముగా మనసున నిశ్చయపరచుకొంటిని. మా బావగారితో మాటలాడితిని. ఆ పిల్లకొక ప్రేమ వ్యవహారం కలదని, తన ప్రియుని వివాహమాడుటకై ఇట్లు నాటకమాడుచున్నదని పుకారొకటి కలదని చెప్పెను. నా కర్థమైనది. బట్టలు సవరించుకొనుట, నేల బాగుండలేదని తెలుసుకొని ప్రక్కకు తొలగుచూ దొర్లుట, చుట్టు చేరినవారిని గమనించుచు తగు రీతిలో నైపుణ్యముగా మాటలాడుట, తనకు నమస్కరించి లెంపలు వేసుకొమ్మని నాకాజ్ఞాపించుట ఇవన్నియు గురుతు తెచ్చుకొనగా ఆమెది సంపూర్ణముగ నాటకమని నా కవగతమైనది. నా పూర్వపరిచితులైన కొందరాప్రాంతపు హిందూస్తానీయులనూ, మన తెలుగువారినీ కలిసి విషయములు కూలంకషముగా చర్చించి దాదాపొక నూరుమందిని కూడదీసితిని. ఆ అమ్మాయిని గురువారమునాడు నాగేంద్రుడు వచ్చి కాటువేయునని ఆమె నురగలు గ్రక్కునని ఊరు ఊరంతయు గొప్ప పుకారు బయలుదేరినది. గురువారం ఉదయంనుండి మేము కాపుకాస్తిమి. మాకు తిండితిప్పలు లేవు. ఈ వార్త వైల్డు ఫయిర్ వలె పరిసరములందనేక గ్రామములలో ముట్టుకొని జనులు తండోపతండములుగా చేరుచుండిరి.

సాయంత్రము మూడు గంటలు దాటినది. ఆమె నాగదేవత వలె అలంకరించుకొని (పాముపంటి బొట్టుపెట్టుకొని, కోలగా కనులు దిద్దుకొని, నాగసర్పము వంటి పటకానొకదానిని నడుమునకు చుట్టుకొని, నాగపతకము మెడలో వేసుకొని ) బయటకు వచ్చి సర్పము ముగ్గుపై కూర్చున్నది. ఆకసము వైపు అదేపనిగ చూచుచు ఏదేదో గొణగ దొడగినిది అమ్మో అమ్మో అమ్మో అనీ, దేవా దేవా స్వామీ అనీ ఘోరముగా అరచుచు నేలపడి పొరలనారంభించినది. పామెవ్వరికినీ కానరాలేదు. మోసము మోసమని, మాయ మాయ అని మేమరచుచూ గోలచేసితమి. ఒక దృఢ కాయుడు పరిగెత్తుకొని ఆ పిల్ల కడకు వెళ్ళి సర్పము వంటి ఒక (గిల్టు ? ) ఆభరణముతో ఆమె కాలిపై గట్టిగా రట్టెను మేము చూడకుండా అడ్డుగా కూర్చొని ఆతడాపని చేయుట మాలో కొందరు స్పష్టముగా గమనించిరి లేత చర్మముపై చిన్న నాటుపడి ఆమె కాలికి రక్తము చిందినది ఇదిగో చూడు గాటు! అదిగో చూడు ఆమె నోట నురగలు! నిరూపణమైనది! దేవా -నాగదేవా -అని నమస్కరించుచు ఆమె చుట్టూ తిరుగుచూ పెద్దఅరుపులరిచినాడు ఆమె నోట

నురగలు తీయుచున్నది. జనమందరు నాగదేవతా శాంతించు శాంతించుమని వేడుకొనుచు దండములు పెట్టుచుండిరి. ఆ పిల్ల సొమ్మసిల్లినట్టు నటించినది. పామేదీ ? ఇదంతా నటన -అని మేమరవగా, దివ్యసర్పము పాపులైన నరులకుకనపడునా ? అని ఆమె పరిజనము సమాధానమిచ్చిరి. పోని అమ్మాయిని పాము కరచినదో లేదో వైద్య పరీక్షచేయించమని మేము సవాలు చేస్తిమి. మమ్ము దరిజేరనివ్వలేదు. పెద్ద పెద్ద కర్రలతో దూరముగా నెట్టుచూ బలప్రయోగముతో మమ్ములను ఆ పరిసరములనుండి తొలగదోసిరి. గంధము బొట్లు పెట్టుకొన్న ఒక పండా వచ్చి హిందుస్తానీ యాసతో యేవోవో అర్థముకాని మంత్రములు పఠింపదొడగెను. అమ్మాయి పాదములవద్ద కొబ్బరి కాయలు, అరటి పళ్ళు, నూతన వస్త్రములు కుప్పకుప్పలుగా పడుచున్నవి. పెద్ద రాగిపళ్ళెములో డబ్బులు కురియుచున్నవి. ఈ తతంగము సుమారొక అరగంటకుపైగా సాగినది. ఆమె చుట్టూ విశేష ధన, సంపదలు కుప్పకూడినవి. పండా చుట్టు దొంగచూపులతో పరికించుచు చివరికి ఒక మంత్రము గొణగగా - ఆమె తెలివి నటించి తెప్పరిల్లి లేచి కూర్చున్నది. నాగదేవత కరుణించినది కరుణించినదని భక్తజనులరచిరి. మమ్ములను దరికి చేరనివ్వలేదు. పరీక్షించి చూడనివ్వలేదు. ఆమెను వడివడిగా ఇంటిలోనికి గొనిపోయిరి. ఆమె తలవంచుకుని పరుగునడకతో లోనికి వెళిపోయినది. వ్యతిరేకించిన మా వైపు దూరమునుండియే ఎఱ్ఱని చూపొకటి విసిరినది. బలాఢ్యులైన ఇద్దరు మనుష్యులూ, పండా కలిసి ధన సంపదలను సంగ్రహించి లోనికేగిరి.

నాగదేవత వెనుక కుట్రకలదు, ఇదంత పెద్దనాటకమని- మా పక్షమువారు కేకలు వేసి కొద్ది పాటి అలజడిని సృష్టించగలిగిరి.

కొలది దినములలో నొకయువకునిపై నాగేంద్రుడు వాలునని ఆ యువకుని కీమేతో పెండ్లి చేయువలెనని పుకారు పుట్టినది. వ్యతిరేకించిన నాపై పగతీర్చుకొందురని మాకు కీడు జరుగునని నాగ దేవత మమ్ము శపించినదని జనులనుకొనసాగిరి . మాలోనొకడు సైకిల్ తొక్కుచూ మరునాడు దారిలోనున్న రాళ్ళ కుప్పపై తొట్రుపడి చక్రము తిరిగిపోయి పడిపోయెను. కుడిచేతికి స్వల్పముగా గాయములైనవి. ఇది చాలదా ఇకనైనా పశ్చాత్తాపము తెచ్చుకుని భక్తునిగా మారనిచో, ఈ సారింకొక గట్టి ప్రమాదము జరిగి చచ్చుట తప్పదని జనమందరు మేము వినుచుండగనే అదేపనిగా చెప్పుకొనారంభించిరి. నేనాతనికి కొద్దిగా ధైర్యము చెప్పితిని మొత్తము మీద హేతువాదులమైన మేమందరము గట్టి కట్టుగానుంటిమి. జనులు నిత్యము నాగదేవతకు కానుకలిచ్చుచునే ఉండిరి.

ఆ యువతి ఒక రోజు కొద్దిసేపు నేలపై బోర్ల తిరిగి దొర్లుచు రెండుచేతులును తలపై సర్పమువలె పెట్టుకొని నటన చేయుచు తక్కిన సమయమంత విశ్రాంతి తీసుకొనుచు, మరలనొకరోజు జనులు విశేషముగ కూడినపుడు మరల దొర్లుచు దాదాపు నెలరోజులు నాటకములాడినది. ఒక రోజు తనను నిందించుచు పలు ప్రశ్నలు వేసిన ఒక బహుఅందగాడైన దాదాపు నలుబదేండ్ల వానిని పట్టుకొని, అతనిని పామువలె గట్టిగ చుట్టుకొని ముద్దులపై ముద్దులు పెట్టుకొని అతని చెంపలు కొరికినది అతనికి ఒక చెంపపై చిన్న గాటు పడినది. నాగదేవత కాటువేసినది కాటువేసినదని పాపమతడు నిలువెల్ల వడవడ వణికి పోయినాడు. చివరికి తప్పైనదని చెంపలు వేసుకొని ఆమెకాళ్ళకు నమస్కరించి మెల్లిగా

జారుకొనినాడు. ఆమె వెండితో నాగసర్పమువంటి ఆభరణము చేయించి తెమ్మని అతనికి సెలవిచ్చి పంపివేసెనట. పాపమతడొక పేదవాడు. నాలుగైదు రోజుల తరువాత అప్పోసప్పోచేసి ఆమె చెప్పిన ఆభరణము తెచ్చి ఆమె పాదములపై పెట్టినాడట. మరియొక సంగతి తెలిసినది. ఆమె ఒంటిమీద అతితక్కువ బట్టలతో అర్ధనగ్నముగా కొన్ని ఛాయాచిత్రములను తీయించుకొనినదట. ఆమెను వలచిన కుర్రవాడొకడు ఆమెకొక పచ్చి బూతులతో ఉత్తరమొకటి వ్రాసినాడట. మా వారు ఈ వివరములన్నియు సేకరించి కొంత ధనము ఖర్చుపెట్టి ఆమె అర్ధనగ్న చిత్రములో కొన్నిటిని సేకరించినారు.

టీనేజిలోను తొలియవ్వనములోనుగల యువతీయువకులకు తరచుగ కలలోనికి వచ్చుచుండును. పాము సెక్సుచిహ్నము. ఫ్రాయిడ్ చెప్పిన సైకో-ఎనలిసిస్ చదివినవారికిది తెలిసియేయుండును. నాగదేవతది కొంతవరకు అణచబడిన కామవాంఛగా అర్ధము చేసుకొనవలెను. ఏ వెంకటేశ్వరుడో, ఏ అమ్మవారో మరెవరో వాలక నాగేంద్రుడే వాలడమేమి ? ఆమె నేలపై పామువలె నిలువుగా పాకుటలేదు. అట్లుచేసిన వొళ్ళు కొట్టుకొనిపోవుచ్చును. అందుచే సౌకర్యముగా అడ్డముగా దొర్లుచున్నది. అట్లు దొర్లుటవలన కొన్ని శరీర భాగములు అణచబడి కామప్రకోపము కొంతవరకు తగ్గవచ్చును. కాని అట్లెక్కువకాలము చేసిన వొళ్ళు నొప్పి పుట్టును. కనుక 24 గంటలలో ఏ అరగంటో లేక గంటో జనము చేరినపుడు మాత్రమే నేల దొర్లును. ఈ గుణములసంగతి ఇట్లుండగ ఆమెను ఎవరో కొందరు పెద్దమనుషులు ఇట్లు నాటకమాడించుచున్నారు. ప్రజలనజ్ఞానము ఆసరా చేసుకొని సొమ్ము చేసుకొనుటకు, జరుగుచున్న కుట్రయిది. ఆమెను క్రమముగా ఒక దేవతవలె చిత్రింతురు. ఇది వారికి గొప్ప ధనాదాయమును ఇచ్చును --- అని మాకు బాగుగా బోధపడినది.

నాగేంద్రుడితో ఆమెకు పెండ్లియని నాలుగుసార్లు చెప్పుట నాలుగుసార్లును వాయిదాపడుట కూడా జరిగినది కారణము మేమందరమును గ్రామమంత అలజడిచేయుట, ఆమె చర్యలను సదా కనిపెట్టుట-అని చెప్పవచ్చును. ఏదిఏమైనను ఆమె చర్యలు కొంతవరకు కొద్దిగా తగ్గినవి. ఆమెలో కూడా కొంత జంకేర్పడినది. మేము అనేక విషయములు సేకరించితిమి. చివరికి, ఎట్టకేలకు నాగదేవతకు పెండ్లి రోజు వచ్చినది. ఆ రోజు వచ్చిన కానుకలకు మేరలేదు. పందిరి వేసిరి. ఇల్లాళ్లు అనేకమంది ఆమెకు విరివిగా అలంకారములు చేసిరి. జనులు అంతులేకుండా మూగుచుండిరి. అదే సమయములో కోటనగరములో గుల్‌బహార్‌వీథిలో నొకనిపై నాగేంద్రుడు వాలినాడు. అతడు నాగదేవత ప్రియుడేనని తెలిసినది -!!

ఇనుమిక్కిలి ఓర్పు వహించి జనులను చేరనిచ్చితిమి. మల్‌హోత్రా అనునొక పోలీసు ఆఫీసరును సంప్రదించితిమి. అతడు కొందరు ఆడ కానిస్టేబుళ్లను మఫ్టీలలో పంపించెను. చివరికి నాగేంద్రుడైన యువకుడు వచ్చెను. రాత్రి అయినది. దీపములు పెట్టిరి. కన్నుల వైభవముగా పందిరినలంకరించిరి. అట్టి సమయమున నాగదేవత అర్ధనగ్న ఛాయా చిత్రములను, పచ్చిశృంగార (బూతు?) లేఖలు నేర్పుగా బయట పెట్టితిమి. మావారు మరికొందరు మరికొన్ని వివరములతో వారి దుర్నడతను బయలు పెట్టిరి. మాలోనొకడు నోటినుండి నాగదేవతవలె అమితముగా నురగ తీసి

చూపించెను. మరియొకడు విభూతి తీసెను. మరియొకడు పామువలె దొర్లి చూపించెను. చుట్టు చేరిన జన సందోహములో సందడి బయలుదేరినది. కొందరిలో దిగ్భ్రాంతి పొడమినది. కొందరామెను సన్నసన్నముగ దెప్పనారంభించిరి, కొందరు సాహసించి నిందింపనారంభించిరి, వాతావరణములో మాకనుకూలమైన మార్పు కనపడినది.

మల్హోత్రా కొందరు మఫ్టీలోని ఆడపోలీసుల సహాయముతో ఆమెను, ఈ మాయా నాటకములో సహకరించుచున్న కొందరు పేరంటాళ్ళను, ఇద్దరు బలిష్టులైన వారి మనుష్యులను అరెస్టు చేసెను. పోలీసులు నాగేంద్రుని పట్టుకొని నాలుగు లాగిరి . మాలోనొకడు సమయము కనిపెట్టి ఇట్టి నీచులను ఉరితీయవలెనని అరచెను. సంయమనము పాటించవలెనని మావారికి నేను సైగ చేసితిని. ఆ యువతి ముద్దుకాటులను బహుమతి పుచ్చుకొని హడలిపోయిన సుందరాంగుడు వచ్చి తన్నినంతహంగామా చేసెను. తానిచ్చిన వెండి నాగసర్పాభరణము తిరిగి ఇమ్మని భీష్మించి కూర్చొనెను.

ఒక హిందూమతసంస్థకు చెందిన పెద్దలు ఒక ప్రత్యేక ప్రయోజనముతో ఒక పథకము ప్రకారము ఆమెచేత నాటకమాడించిరని నేను సహేతుకముగా నిరూపించగలిగితిని. కొంతసేపటికి అందరును నాగదేవతను ఛీత్కరించిరి. దైవము పేరుతో సొమ్ముచేసుకొనువారికి తగు శాస్తి చేయవలసినదిగా పోలీసులకొక సలహానొసంగిరి. ఒక పోలీసు పొట్టఎగురునట్లు పకపక నవ్వెను.

నాగదేవత సంగతులన్నియు ఆదినుండి పూర్తిగా వివరించి బాబాలు స్వాములు, మాతాజీలు అమ్మలు ఏవిధముగా పుట్టుకొని వచ్చుచున్నారో ప్రజలలో అజ్ఞానము ఇనుమిక్కిలి మత మూర్ఖతను పరిపరి విధములుగా వ్యాపింపజేసి సొమ్మెట్లు చేసుకొనుచున్నారో మేము బోధించి ఈ విషయములను మరింతగా వివరించు కరపత్రములను జనులందరికి విరివిగా పంచితిమి . ప్రజలలో కొంతమేరకు తెలివిడి ఏర్పడినది. మా చర్యలతో సత్యనిరూపణములో వారికి ప్రబోధము చేయగలిగితిమి ఆ ప్రాంతములకు ఇక ఇంతలో ఏ బాబాకాని, స్వామికాని, అమ్మకాని అచ్చుటకు సాహసింప జాలదని నేను దృఢముగా చెప్పగలను ఇది నాఅనుభవము నాగదేవత శాపమువలన నాకేమి కీడు కలగకపోగ మా స్వగ్రామము తిరుగు వచ్చుసరికి మా పెద్దమ్మాయిని కట్నము లేకుండా వివాహము చేసుకొనుటకొక యువకుడు ముందునకు వచ్చెను. నాకు మంచియే జరిగినది కదా త్వరలో వారిద్దరికి పెండ్లి జరిపెంచెదను. మీకెల్లరకు తప్పక విందు ఇచ్చెదను."

పలువురు సత్యవ్రతునికి కంగ్రాచ్యులేషన్సు చెప్పిరి. ఒక మిత్రుడు వీలైనంత త్వరలో నీ కుమార్తెకు పెండ్లిచేసి గ్రేండు డిన్నరు ఇవ్వవలసినదని మాఅందరితరుపున ఇంగ్లీషులో రిక్వెస్టుచేసెను.

- అని సత్యవ్రతుడు కూర్చొనెను. సభలో నవ్వులు, కరతాళ ధ్వనులు మారుమ్రోగినవి.

## నాంచారవ్వ

తరువాత - జంఘాల శాస్త్రిగారూ మీరిప్పుడు ఉపన్యసింపవలెనని సభికులు నన్ను కోరిరి. నేను జన్నవరము అను గ్రామములో వెలసిన నాంచారమ్మను గూర్చి ఉపన్యసింప నారంభించితిని.

జన్నవరము ఇక్కడకు దక్షిణముగ 37 మైళ్ళ దూరములోగల చిన్న గ్రామము. అది నర్సీపట్నము రోడ్ రైల్వేస్టేషనుకు పడమరగ కూతవేటు దూరమున నుండును. అక్కడ మా మేనమామ కలదు. నేనిటీవల అక్కడకు వెళ్ళి ఈ రోజుననే తిరిగి వచ్చితిని. అక్కడ నాంచారవ్వయ్యను సుమారు ఎనుబది ఏండ్ల ముసలిది కలదు. ఆమె మగవానివలె నుదుట పట్టినామములు తీర్చి నిత్యము భజనలు చేయుచుండును. జనులు విశేషముగ ఆమె చుట్టూ చేరుచున్నారు. ఆమె భజన చేయుట ముగించు సరికి పైనుండి ప్రసాదపుముద్ద పడును. అట్లు పడుట అనేకులు చూచిరి. అది అసంభవమని నా విశ్వాసము. మీకు తెలియున్ను. నేను విగ్రహారాధకుడను కాను. నాకు మూఢ విశ్వాసములు లేవు. అభూత కల్పనలు నమ్మను. నేను దీనిని పరిశోధించుటకు నిశ్చయించుకొంటిని. నేనునూ ఊర్ధ్వ పుండ్రములు తీర్చి భక్తునివలె నటించుచు మొదటివరుసలో నాంచారవ్వకెదురుగా కూర్చుంటిని. ప్రతి క్షణము అవ్వను పరిసరములలోగల ఆమె సన్నిహిత శిష్య, భక్త బృందమును పరిశీలించుచుంటిని. దాదాపు గంటవరకు భజన సాగినది. చాల మందికి అరచేతులు మంట పుట్టుచున్నవి. అవ్వ ఒక్కరితె మాత్రము కంచుతాళపు చిప్పలతో భజన చేయుచున్నది. ఆమె సొమ్మేమి పోవలె. మాచేతులు గదా మంట. అవ్వ చుట్టూగల నలుగురు భక్తజనులు చేతులు పైకెత్తి "గోవిందా గోవిందా అనండి - పైకి చూడండి - పైకి - అదిగో - పడుచున్నది - ప్రసాదము పడుచున్నది. - అని హడావిడి చేయుచు అరచిరి. నేను పైకే మొగముంచి నిశితముగా చూచుచుంటిని గాని, క్రీగంట అవ్వనే కనిపెట్టుచుంటిని. అవ్వ మొలను దోపిన ప్రసాదపు ముద్ద హటాత్తుగా పైకి విసిరినది. అది చప్పుడు చేయుచు నేల పడినది. నా రెండు కళ్ళార చూచితిని. మూర్ఖభక్తులు మూఢపారవశ్యముతో ఓహో ! ఓహో!! ఓహో !!! - అని తన్మయతచెందిరి.

నేను మరునాడు ఒక పది మంది పెద్దలకు ఈ విషయమును సవివరముగ బోధించి రహస్యము ఛేధించువరకు బయలు పెట్టవద్దని చెప్పి ఒప్పించి తీసుకొని వెళ్లితిని భజన సమయములో వారిలో నలుగురు మిగుల భక్తి నటించుచు అవ్వచుట్టు చేరి చేతులు పట్టుకొని మొలనుగల ప్రసాదపు ముద్దను లాగిరి. ఈ హఠాత్ పరిణామముతో అందరును నిశ్చేష్టితులైరి. అవ్వ గజగజ వణికెను. భక్తులందరుకు రహస్యము తెలిసిపోయినది. నాంచారవ్వ ముసలిదగుటచే సరిపుచ్చి తీవ్రముగా దూషించి (కొందరు బండ బూతులు తిట్టిరి ) అంతటితో పోనిచ్చిరి ఇక పై ఆమె చేయించు భజనకు రాకూడదని నిశ్చయించిరి.

నాంచారవ్వ కాక మగ స్వామిగాని యోగిగాని అయినచో ఎముకలు విరిచియుందురు పాపమిపుడు ఆమె బిచ్చమెత్తుకుని బ్రతుకుచున్నది. ఇప్పుడు ఆమెనెవ్వరును భక్తురాలుగా నమ్ముటలేదు. (మంచిపని జరిగినది) నాంచారమ్మకు నాలుగు తగలనిచ్చి వైకుంఠము చేర్చవలసినదని - సభలో చివర ఎవరో అరచిరి.

సభాసదులారా మన హిందువులలో దురాచారములధికముగా ఉన్నవి. మూర్ఖత్వము మిక్కిలిగా పెరుగుచున్నది. నేను వినుచుండగనే ఆ యూరిలో కొందరు -ఇంతకంటే క్రైస్తవ, ముస్లిం మతములువేరు. మనవలె వారికి ముక్కోటి దేవతలు ఈ పూనకములు ఈ మొక్కుబడులు, ఈ బలులు లేవు అనుట.

వింటిని. ఎంత ఘోరము ! ఇట్టివింకను మనలో కొనసాగిన మరికొందరు జనులు విసిగి ఈ మతమును విడిచెదరు కాగా ఇతరమతములలో మౌఢ్యము లేదనుట సరికాదు. ఆయాదేశములలోకూడ మూఢాచారములధికముగనే యున్నవి. షేక్స్పియర్ నాటకములు చదివిన - చేతబడులు, దయ్యములు అతీత శక్తులు, ఆత్మలు కనిపించును. అతని రచనలలో మెక్‌బేత్, హేమ్లెట్ అను నాటకములు మిక్కిలి ప్రసిద్ధములు గదా ! వానినొకపరి నిశితపరిశీలనతో చదువుడు. యూరప్‌లో శాస్త్రవేత్తలైన కెప్లరు, గెలీలియో మొదలైన మహానుభావులు చెప్పిన సిద్ధాంతములను ప్రచారముచేసి సూర్యచంద్రులు, భూమి నక్షత్రములు దైవాంశములు కావు గోళములనియు, జ్యోతిష శాస్త్రముకంటే ఖగోళ శాస్త్రము హేతుబద్ధమైనదనియు, బైబిలులోని కొన్ని రాతలు అభూతకల్పనలనియు ప్రచారము చేసిన లియనార్డో బ్రూనో అనునాతనికి బహిరంగముగా మరణశిక్షవిధించి బహిరంగముగ అతిదారుణముగ దానిని అమలుపరిచిరి. లేదా . ముస్లిం మతములో స్త్రీలపై సైతాను పడునను భయముతో వారికి నల్ల బురఖాలు తొడగుటలేదా? అతీతశక్తుల విశ్వాసము ఆ మతములలో కూడ మిక్కుటముగనే కలవుకదా !

ఒకపర్యాయము ఆలోచింపుడు. విశ్వాసము వేరు వాస్తవము వేరు, నీవు విశ్వసించినను విశ్వసింప కున్నను సూర్యుడు అందరికి కనపడును. దేవుడుదయ్యము ఎల్లరకూ కనిపించరు. సూర్యునివలె వాస్తవమైనచో అందరకునూ కనిపించవలెను కదా ! సూర్యుడు సర్వ ప్రపంచమునకు వేడిమిని, వెలుతురు ఇచ్చుచున్నాడు. ఆతడు తనకు నమస్కరించమనుటలేదు. కొబ్బరి అరటిపండ్లు దక్షిణలు అడుగుట లేదు. మీరు విశ్వసించినను, విశ్వసింపకున్నను నిత్యము ప్రకాశించుచున్నాడు. అట్లే ఈ భూమాత మనలను మోయుచున్నది. పాడిపంటలను, ఖనిజములను సమస్తములును ఇచ్చుచున్నది. గంగ - మనప్రాణములను నింపుచున్నది. ఈ ప్రకృతి శక్తులన్నియు మనకు జీవన దాతలు. అవి మనలను మ్రొక్కుబడులను కోరలేదు పూజలు చేయమనలేదు. కోళ్ళను, మేకలను , మనుష్యులను బలియిమ్మనుటలేదు. కనుక నా అభిప్రాయమొకటి నిశ్చయముగా చెప్పెదను వినుడు. నిజమైన దైవము స్వార్థముతో కోరికలు కోరడు, ఆగ్రహించడు, హాని చేయడు, సర్వులకూ సుఖసంతోషములు కోరును, సమస్త ప్రాణికోటిని సమభావముతో చూచును. కులమతములు పేదలు ధనికులు అను భేదభావము చూపడు. ఇవన్నియు కొన్ని వర్గములకు చెందిన మానవులు స్వార్థముతో చేసిన కల్పనలు. సత్పురుషులు సత్యసంధులై మానవత్వము కలిగి మెలగవలెను ఈ విషయములనన్నింటిని మనము సామాన్య జనులకు చక్కగా వివరించి ప్రబోధించి వారిని చైతన్య పరుపతవలెను.

నిరంతరము విగ్రహములను గురించి రకరకముల కల్పిత దివ్యరూపములను గురించి అదేపనిగా నూరిపోయుచు పదేపదే చెప్పినచో మానవులకు క్రమముగ అట్టి ఆలోచనలే కలుగును. ఆయాభావములు మనములలో స్థిరముద్రవైచుకొనును. ఉదాహరణమునకు యువకులు తమ ఫేవరేట్ సినీ స్టార్సును తలచుకొనుచు పంచరంగుల కలలో విహరింతురు. ఆ నటీమణి హంగురంగులతో వచ్చి వొడిలో వాలినట్లు డ్యూయెట్‌లు పాడినట్లు కలలుకందురు.

వాణీదాసు మధ్యలో అడ్డము వచ్చి "మన నల్లాచార్యుల కుమారుడు కాలాచార్యుల ఎరుగుదురుకదా అతనికి చదువుకొనురోజులలో జయలలిత యను నటీమణియనిన మహా ప్రాణము చదువుకొనునోటుబుక్కులలోను, జేబులోను వ్రాతబల్లపైనను ఆమె బొమ్మలే పెట్టుకొనెడివాడు. ఇటీవల కాలంలో పార్టీమారినాడు. ఇప్పుడతడు తాజాగా జయసుధ ఫేన్. నిరంతరము ఆమెకలలతోనే మైకములోనుండును అతనికి పెండ్లియై ఇద్దరు బిడ్డలుకూడా ఉన్నారు. కాని తరచుగా నిరంతరమామె యూహలలోనే తేలియాడుచుండును"- అన్నాడు.

"వస్తావు కలలోకీ రానంటావు కౌగిలికి " -అప్రక్కనొక కుర్రకుంక సినీగీతము కూనిరాగము తీయదొడగెను. నేను కోపముగా కనులెర్రచేసితిని. సత్యవ్రతుడు సర్రునలేచి, సైలెన్స్ సైలెన్స్ అని గట్టిగా అరచెను. ఈ అంతరాయమునకు చింతించుచు మరలనారంభించితిని.

"ఇది ఎట్లు జరుగుచున్నది ? ఆలోచింపుడు భగవద్భావము పూర్వపరజన్మలు మొదలైనవన్నియు ఇట్టివే. మానసికముగ అవి ప్రజలను పట్టుకుని యుండును. కనుక అవియే సత్యములను భ్రమతో మానవులు ప్రవర్తింతురు. ఏ సినీతారనూహించుకొనిన ఆమెయే కనపడునట్లు, నిరంతరమే దైవరూపమును భజించిన ఆ రూపమే మానసికముగా కనులకు కనపట్టును. దానినే పారవశ్యభావముతో భక్తులు దైవసాక్షాత్కారమందురు. ఈ చిత్త విభ్రమము శృతిమించివచో కథ పూనకములోనికి దిగును. ఈ సంగతులను మనము బాగుగ ఆలోచించి అర్థము చేసుకొని సామాన్యజనులకు వివరించవలెను. కొబ్బరిచెట్టుకు కొమ్మలుండుట. కోడిగుడ్డుపై శంఖచక్రముల వంటి మచ్చలుండుట, పొడవుమూతితో పుట్టిన పందిపిల్లను ఏనుగు పిల్లఅనుట మూర్ఖత్వము కాక మరేమనవెను కనుక సామాన్య జనులను హేతువాద శాస్త్రీయ విధానములతో, ప్రగతిశీల భావములతో ప్రబోధించుటకు మనమందరము సంఘటితమై పనిచేయవలెను."

-అని చెప్పి నేను కూర్చొంటిని.

## విశ్లేషణ ; దృక్పథము

"పెద్దలు జంఘాల శాస్త్రిగారు చెప్పిన అంశములలో కొన్ని పరస్పర వైరుధ్యములు లోపములున్నవని తలంతును మన్నించిన తమకు వివరించగలను" - అని సత్యవ్రతుడు లేచి నిలువబడెను.

తప్పక వివరముగ చెప్పుమని నేనంటిని. సభికులు మాకన్నియు వివరముగ చెప్పవలె, ఇప్పుడే చెప్పవలెననిరి. సత్యవ్రతుడు చెప్పదొడగెను.

"జంఘాల శాస్త్రిగారు ప్రకృతి శక్తులైన సూర్యుడు, భూమి, నీరు, గాలి వంటివి దైవములని భావించుచున్నట్లున్నవి. దీనిని నేనంగీకరించను. అవి ప్రకృతిశక్తులు మాత్రమే. వాటినావిధముగా గుర్తించిన చాలును. ప్రకృతి శక్తుల లక్షణములను, భౌతిక తత్త్వములను తెలుసుకొనిన మరింత మంచిది. అంతియగాని ప్రకృతి శక్తులకు మానవుడు తలవంచవలెనని నేనొప్పుకోను.

విగ్రహారాధన మానివేసినంతమాత్రాన చాలదు. ఏదో అతీత శక్తి మానవులను నడుపుచున్నదని నమ్మట కూడ సరికాదు. గతి తార్కిక భౌతికవాద సూత్రముల నాకళింపుచేసుకొని, ఈప్రపంచములోని విషయములను ఆ సూత్రముల వెలుగులో విశ్లేషించుకొని అవగతము చేసుకొనుటవసరము.

హిందూమతము నశించునెమోనని కొందరు వాపోవుట కలదు. శాస్త్రిగారికి కూడ అట్టి భావము కలదని అనిపించుచున్నది. వారు కొన్ని మతములలోని మూఢాచారములను పరిశీలించినట్లు తోచుచున్నది. కాని అది చాలదు. భౌతికవాదము, ఆర్థికసూత్రములు సాంఘిక నియతి, వివిధ వర్గములు, వర్గస్వభావము ఆమూలాగ్రముగ అధ్యయనము చేయవలెను. మరియొకసారి సమావేశము అయినపుడు ఆయా విషయములపై నాకు తెలిసిన మేరకుపన్యసించెదను" అని కూర్చొనెను.

కాలాతీతమైనది. తదుపరి సభలో గతితార్కికభౌతికవాదముపై తప్పక ఉపన్యాసములు, చర్చ కొనసాగింతము - అని లేచితిని. ఎల్లరును నాటికి ఆలోచనలతో తలలు పంకించుచు నిష్క్రమించిరి.

(ఇది, 1984 లో విశాఖ జిల్లా చోడవరంలో జరిగిన ఒక యదార్థ సంఘటన, నా స్వీయానుభవము ఆధారంగా రచించిన కథ. పానుగంటివారి "సాక్షి" వ్యాసముల పద్ధతిలో రచించినది. పాత్రలు మొదలైనవి పూర్తిగ కల్పితములు.)

**రచన : 31-8-84**

**ప్రచురణ : ఉపాధ్యాయ మాసపత్రిక, అక్టోబరు 1984.**